క్లుప్తంగా

మునిపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు



మునిపల్లి శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామంలో పార్వతీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ సందర్భంగా పండితులు కొమానపల్లి సూర్యనారాయణ శర్మ, కాశీ విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా యాగశాల ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యావహచనం, పంచగవ్యం, అగ్నిప్రతిష్టాపన, వృషభ జయాది హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ కంటి వైద్య పరీక్షలు



వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హాసన్

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఎండీ హాసన్ ఆధ్వర్యంలో రోగులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాపాక సౌమ్య, ఏఎన్ఎం అమరావతి, హెల్త్ సిబ్బంది బ్రహ్మానందం, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొన్నారు.

అక్షయ పాత్రకు కూలర్స్ బహూకరణ



అక్షయ పాత్రకు వాటర్ కూలర్స్ బహూకరిస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్యాత్మిక సంస్థకు పలువురు దాతలు రూ.64 వేల విలువైన రెండు వాటర్ కూలర్స్‌ను శుక్రవారం బహూకరించారు. స్థానిక దక్షణేశ్వర కాలభైరవ శక్తి స్థల్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన అక్షయ పాత్ర, గోశాల సేవకులు నూకల నాగేంద్ర వర ప్రసాద్, కుమారి దంపతులు రూ.24 వేల విలువైన వాటర్ కూలర్, ఓ అజ్ఞాత భక్తుడు రూ.40 వేల విలువైన వాటర్ కూలర్ అందించారు. అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నడుస్తున్న చలి వేంద్రం నిర్వహణకు ఉప్పలగుప్తం మండలం నంగవరానికి చెందిన జిన్నూరి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల రాజేష్, చల్లపల్లి గ్రామానికి చెందిన అన్నంనీడి బాబా వీరేంద్ర, నల్లా కొండబాబు రూ.3000 వంతున విరాళాలు అందించారు.

డీఈఓకు వినతి



డీఈవో కమలకుమారికి వినతిపత్రం అందజేస్తున్న యుటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో పనిచేయాలని వారిపై ఒత్తిడి తేవడానికి వీల్లేదంటూ డీఈవో కమలకుమారికి యూటీఎఫ్ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో కోనసీమ ఎస్టీయూ అధ్యక్షుడు శివప్రసాద్, యుటీఎఫ్ నాయకులు సురేష్‌కుమార్, బేతినిటి శ్రీనివాస్, వై.మురళీ తదితరులున్నారు.

విద్యార్థికి సత్కారం



యశ్వంత్ కృష్ణను అభినందిస్తున్న వూటుకూరి వీరబ్రహ్మాం తదితరులు

అమలాపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులు సాధించిన విద్యార్థి యశ్వంత్ కృష్ణను బండారులంకలో కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూటుకూరి వీరబ్రహ్మం, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామి శుక్రవారం అభినందించారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు వూటుకూరి సోమరాజు రూ.10,116 ప్రోత్సాహక బహుమతిగా అందించి సన్మానించారు. కార్యక్రమంలో యశ్వంత్ తల్లిదండ్రులు అంకం బాల సోమశేఖర్, రమాదేవిలతో పాటు కోనసీమ దేవాంగ సంఘ ప్రతినిధులు జాన శంకరరావు, పిచ్చిక శ్యామ్ పాల్గొన్నారు.

కదలని మురుగు... పూడిక తీతతో మెరుగు

- రూ.32 లక్షలతో పారిశుద్ధ్యం మెరుగుపరిచే పనులు
- 58 కిలోమీటర్ల మేర పూడిక తీతకు చర్యలు



అమలాపురంలోని డ్రెయిన్ల పూడిక తీత పనుల దృశ్యం



గాంధీబజార్‌లోని డ్రెయిన్ పూడికలతో రోడ్లపైకి చేరిన మురుగు నీరు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో ఉన్న మేజర్, మైనర్ డ్రెయిన్లలో పూడిక పేరిగిపోయి మురుగు నీటి ప్రవాహానికి అవరోధమవుతోంది. మున్సిపాలిటీలోని 30 వార్డుల్లోనూ డ్రెయిన్లలో పూడికలు పెరిగిపోయి మురుగు ప్రవాహం స్తంభించి రోడ్లపైకి పొంగి పొర్లుతోంది. ఏటా మున్సిపాలిటీ కొన్ని లక్షలు రూపాయలు వెచ్చింది పూడిక తీత పనులు చేయిస్తుంది. గతంలో రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ నిధులు వెచ్చించేది. అయితే ఈ పనులను మరీ పకడ్బందీగా చేపట్టి పూడికలను పూర్తిగా తొలగించే నిమిత్తం ఈసారి మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.32 లక్షలు కేటాయించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, ఆయా వార్డుల కౌన్సిలర్లు దగ్గరుండి ఈ పూడిక తీత పనులను పర్యవేక్షిస్తున్నారు. డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా పాడేయడంతో అవి తొందరగా పూడికలకు గురై ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. పట్టణ ప్రజలు ఈ దిశగా అవగాహనతో చైతన్యవంతులు కావాలని మున్సిపల్ కమిషనర్ నాయుడు విజ్ఞప్తి చేస్తున్నారు.

10 రోజులుగా పనులు ముమ్మరం

పూడిక పనులు గత పది రోజులుగా పట్టణంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. పట్టణంలో 18 కిలోమీటర్ల మేర ఉన్న మేజర్ డ్రెయిన్లు, 40 కిలోమీటర్ల మేర ఉన్న మైనర్ డ్రెయిన్లలో ఈ పనులు జరుగుతున్నాయి. మొత్తం 58 కిలోమీటర్ల మేర దాదాపు వంద మంది కార్మికులు పూడికతీత పనుల్లో నిమగ్నమయ్యారు. గాంధీ బజార్, బస్టాండ్ నుంచి ఈదరపల్లి రోడ్డు, మెయిన్ రోడ్డు ఇలా పలు రోడ్ల చెంత ఉన్న మేజర్, మైనర్ డ్రెయినల్లో పూడికతీత పనులు సాగుతున్నాయి. పూడిక తీయగా వచ్చిన దుర్వాసనతో కూడిన నీరు, మట్టిని ఎండకు ఎండేలా ఒకటి లేదా రెండు రోజులు డ్రెయిన్ల చెంతనే ఉంచడంతో ప్రజలు దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువల్లో పూడికల సమస్య పరిష్కారం కావాలంటే ఒకట్రెండు రోజులు ఈ సమస్య తప్పదని సామాజిక కార్యకర్తలంటున్నారు.

> **మరో పది రోజుల్లో పనులు పూర్తి**
>
> మున్సిపాలిటీలో గత పది రోజులుగా జరుగుతున్న పూడికతీత పనులు మరో పది రోజుల పాటు కొనసాగుతాయి. పూడికలు తీసిన డ్రెయిన్లలో మురుగు నీరు ఇప్పుడు సక్రమంగా పారుతోంది. దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 50 శాతం పనులు వేగవంతం చేసి మరో పది రోజుల్లో పూర్తి చేస్తాం.
>
> – కొత్త అప్పలరాజు, డీఈఈ, మున్సిపాలిటీ, అమలాపురం

17న మెడికల్ క్యాంపు

అమలాపురం రూరల్: అమలాపురం సీవీ రామన్ పాఠశాలలో ఈ నెల 17వ తేదీన మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అమలాపురం యుటీఎఫ్ హోంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులకు మెగా మెడికల్ క్యాంపులో అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జ్యోతిబసు, జిల్లా ట్రెజరర్ కె.సురేష్‌కుమార్, జీవీ రమణ, వై.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నీలి మహర్షి జయంతి

ముమ్మిడివరం: స్థానిక పోలమ్మ చెరువు గట్టు వద్ద పంతగడ నరసింహమూర్తి ఆధ్వర్యంలో నీలి మహర్షి కాళి కృష్ణ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేఎస్ఎన్ మూర్తి, బి.శరత్, పి.నరేష్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో రూ.12.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న జలజీవన్ మిషన్ పనులకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి సౌకర్యం ఉండాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, బీర నరసింహమూర్తి, కోలా ఏసు, బీర శాంతకుమారి, ఉంగరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విలసవిల్లిలో జలజీవన్‌మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సమావేశం

యానాం: స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రొయ్యలు, చేపల సేద్యానికి సంబంధించి అనుమతుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఏడు దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయని వాటిని పరిశీలించి అనుమతిస్తామని చెప్పారు. సమావేశంలో రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి చైర్మెన్‌గా వ్యవహరించగా సభ్యులుగా మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, పీడబ్ల్యూడీ ఈఈ, డిప్యూటీ డైరెక్టర్ ఆక్వాకల్చర్, డిప్యూటీ తహసీల్దార్, ఏడీ ఫిషరీస్ వ్యవహరించారు.



కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ సమావేశంలో పాల్గొన్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

నవోదయ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవడానికి మే 31 ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసై ఉండాలన్నారు. జులై 22న నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల్ని ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు నవోదయ విద్యాలయ యానాం వారిని సంప్రదించాలని కోరారు.

రోగులకు సేవలందించే దేవతలు నర్సులు



నర్సులను సత్కరించిన వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు



ముమ్మిడివరంలో సీనియర్ నర్సును సన్మానిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

అమలాపురం టౌన్: రోగులకు సేవలందించే దేవతలు నర్సులని డాక్టర్ బి.రాఘవేంద్రరావు అన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక యునైటెడ్ నర్సింగ్ హోమ్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో వైద్యులతో పాటు నర్సుల సేవలు కూడా ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన అయిదుగురు నర్సులను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రంకిరెడ్డి కాశీ, క్లబ్ కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, బోణం సత్తిబాబు, తేతల సత్యనారాయణరెడ్డి, పచ్చిగోళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

ముమ్మిడివరం: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో ఘనంగా నిర్వహించారు. కరోనా సయంలో విశేష సేవలందించిన పచ్చిమాల నందిని, ముమ్మిడివరం మంగాలక్ష్మిలను గ్రామ సర్పంచ్ గొలకోటి దొరబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సమాజంలో నర్సులు అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పి.నారాయణరావు, యాళ్ల ఉదయ్, టి.బాబి, డాక్టర్ వినీల్, నల్లా బాలతల్లి, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



యానాం నర్సుల దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్ఏఓ మునిస్వామి

నర్సుల సేవలు అభినందనీయం

ఐ.పోలవరం: ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేస్తున్న నర్సుల సేవలు అభినందనీయమని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ(ఢిల్లీ నారాయణ) అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని టి.కొత్తపల్లి సీహెచ్‌సీ, ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో శుక్రవారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నర్సులను సన్మానించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, పీఎస్ శర్మ, ఎం.శేఖర్ తదితరులు ఉన్నారు.

అమలాపురం రూరల్: స్థానిక కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. కిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, సీఈవో డాక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ మన నర్సులు.. మన భవిష్యత్తు అనే నినాదంతో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మానవ వనరుల విభాగ జనరల్ మేనేజర్ రాధా మనోహర్, జనరల్ మేనేజర్ షెర్మీ జార్జ్, డీజీఎం బైజు థామస్ తదితరులు పాల్గొన్నారు.

యానాం: ఫ్లోరెన్స్ నైటింగిల్‌ను నర్సులు ఆదర్శంగా తీసుకోవాలని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ మాట్లాడుతూ నర్సులు సేవామూర్తులని, కరోనా సమయంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సిలబస్‌పై ఓరియెంటేషన్ తరగతులు

యానాం: యానాం నియోజకవర్గంలో ఈ విద్యాసంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయనున్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఆఫీసర్ డి.సాగుణభాయ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యానాం, పుదుచ్చేరి, కారైకల్, యానాం నాలుగు రీజియన్‌ల టీచర్లకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 16 నుంచి డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, పుదుచ్చేరి, లాస్‌పేటలో ఉదయం 9.30 నుంచి సంబంధిత టీచర్లకు శిక్షణ ఇస్తారన్నారు. ఏ సబ్జెక్టు టీచరైనా రెండు రోజుల పాటు శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. స్కూళ్లు తిరిగి తెరిచేటప్పటికి సీబీఎస్ఈలో శిక్షణ పొందాలన్నారు. ఇతర ప్రదేశాల నుంచి వచ్చే వారికి లంచ్‌తో పాటు టీఏ, డీఏ ఇస్తారన్నారు. మే 16, 17న ఫిజిక్స్, కెమిస్ట్రీ, 18, 19 తేదీల్లో బయోలజీ, మేథ్స్, 22, 23 తేదీల్లో అకౌంటెన్సీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, 24, 25 తేదీల్లో హిస్టరీ, జాగ్రఫీ, సోషల్, 29, 30 తేదీల్లో ఇంగ్లిష్ సబ్జెక్టుపైన శిక్షణ ఉంటుందని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రియదర్శిని తెలిపారు.

సాఫ్ట్‌బాల్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల టీమ్‌తో అసోసియేషన్ సభ్యులు

ముమ్మిడివరం: తూర్పుగోదావరి జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలుర, బాలికల టీమ్ కోచింగ్ క్యాంప్‌ను ఐ.పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు భూపతిరాజు చంటిబాబు ప్రారంభించారు. కోచింగ్ అనంతరం జిల్లా టీమ్ కడప జిల్లా రాయచోటిలో ఈ నెల 26 నుంచి 28 వరకూ జరిగే అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొంటుందని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎస్ రాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.సురేష్‌బాబు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రేవు సారెడ్డి, జంపా సత్యనారాయణ, పాఠశాలల పీడీ మూర్తి, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.ఎస్. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండండి

అమలాపురం రూరల్: గుర్తు తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారమివ్వాలని రూరల్ సీఐ వీరబాబు అన్నారు. రూరల్ ఎస్‌ఐ అందే పరదేశి ఆధ్వర్యంలో కామనగరువు గ్రామ పంచాయతీలో షాపుల యజమానులకు, స్థానికులకు శుక్రవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసుకుని ఊరు వెళుతుంటే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. అలాంటి ఇళ్లకు మోనిటరింగ్ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ఆ ఇళ్లల్లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తే అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం అందుతుందని, తద్వారా వారిని సులువుగా పట్టుకోవచ్చని చెప్పారు. తాలూకా ఎస్‌ఐ పరదేశి మాట్లాడుతూ రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ మరింత పెంచుతామన్నారు. సమావేశంలో సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, కార్యదర్శి ఎ.రాజా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ వీరబాబు

వివాహిత అదృశ్యంపై కేసు

మండపేట: వివాహిత అదృశ్యంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ఛాయనాగ దుర్గా సత్యవతికి రెండేళ్ల క్రితం కాకినాడకు చెందిన కె.శివకుమార్‌తో వివాహమైంది. ఈనెల 9న వేడుక నిమిత్తం పుట్టింటికి వచ్చింది. రాత్రి భోజనాల తర్వాత అంతా పడుకున్నారు. తెల్లారి లేచి చూసే సరికి తన చెల్లెలు కనిపించలేదని, పట్టణానికి చెందిన రౌతు రాజేష్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె సోదరుడు శ్యామ్‌సాయి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.అప్పారావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

మామిడికుదురు: ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పాశర్లపూడి నెల్లివారిపేటలో పంట కాలువపై రూ.10 లక్షలు ఓఎన్‌జీసీ నిధులతో నిర్మించనున్న కల్వర్టుకు ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉన్న సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామన్నారు. నెల్లివారిపేటలో కల్వర్టు పాడైపోయి ఎంతో కాలమైనా ఎవరూ పట్టించుకోలేదని, అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడడం లేదని పక్కా సీసీ రోడ్లతో పాటు బీటీ రోడ్లు నిర్మిస్తున్నామని చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం

అలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం(డ్రై డే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీ శంకర్ కోరారు. డ్రై డే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరిబొండాలు, ఖాళీ సీసాల్లో నీరు, వ్యర్థాలు ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరి అంటు వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పి.వి.రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నీటి నిల్వ ఉంచొద్దంటూ చెబుతున్న ఆరోగ్య సిబ్బంది

పంట కాలువలు అభివృద్ధి చేయాలని వినతి

అయినవిల్లి: వేసవిలో ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పంట కాలువలను అభివృద్ధి చేయాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాల్లో వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల వ్యవసాయ శాఖ అధికారి వై.శోభ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాకిలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోందన్నారు. రైతులు వ్యక్తిగతంగా యంత్ర పరికరాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటుందన్నారు. పండించిన ధాన్యానికి లోకల్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శోభ

రైతు భరోసా అర్హుల జాబితాల ప్రదర్శన

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం అర్హుల జాబితాలను ఆయా గ్రామాల ఆర్బీకేల వద్ద ప్రదర్శనలో ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.సత్యప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. యన మదల రైతు భరోసా కేంద్రం వద్ద జాబితాలను ప్రదర్శనలో పెట్టిన సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రూ. 13,500 గాను, మే చివరిలో మొదటి విడతగా రూ.5,500 ఆయా రైతులకు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం కొత్తగా వ్యవసాయ భూములు కొనుక్కున్న రైతులకు కూడా పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద అర్హుల జాబితాను తనిఖీ చేసుకుని ఎవరైనా రైతులు ఆ జాబితాలో లేకపోతే తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు.